కాకినాడ
TELUGU ACADEMY, COCANADA

# పువ్వులు

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

రెండు ఇళ్లకి మధ్యనున్న బంతిమొక్కల పక్కన రాతిమీద కూర్చొని, మొక్కలవైపూ మొక్కల్లోకీ చూస్తోంది కమల బాల. మేడ ఇంటిమీది మేడ అంచుమీదకి వచ్చిన చందమామ చిరునవ్వు—చిన్నది—పారేశాడు.

ఊరవతల తోట. 'ది గార్డెను' అది. తోటమధ్య పెద్దమేడ. అది మెయిన్ హౌసు. మేడకి కొంచెం పడమటగా చిన్న పెంకుటిల్లు. అది గెస్ట్ హౌసు.

మేడగల పెద్దమనిషి కలకత్తాలో వ్యాపారంగల పెద్దమనిషి. అతగాడు ప్రతియేటా వేసంగికిమాత్రం చల్లగాలికోసం స్వంత వూరుకి కుటుంబంతోసహా వచ్చి నెల్లాళ్ళుండి వెళ్లే అలవాటుగల పెద్దమనిషి. ఆయన కలకత్తాలో ఉండేప్పుడు, ఇక్కడ మేడని అద్దెకి ఇవ్వవచ్చు. కాని, ఊరవతల ఉండే అంతపెద్ద మేడలో అంత మేడకి తగ్గ అద్దె ఇచ్చుకొని ఎవడూ దిగడు. తక్కువ అద్దెకి ఇంటివారు ఇవ్వరు. ఇచ్చినా, దిగినవాళ్ళని ప్రతియేటా వేసంగికి మాత్రం ఖాళీ చేయమనడం బావుండదు. అందుచేత మేడ ఇంటిని తలుపులుమూసి తాళాలు బిగించి ఉంచేరు. గెస్ట్ హౌసునిమాత్రం అద్దెకిచ్చేరు.

ఇల్లు చిన్నది కాబట్టి, ఊరవతల ఉంది కాబట్టి ఇంటివారా గెస్ట్ హౌసుని తక్కువద్దెకి ఇచ్చేరు. ఇల్లు చిన్నదైనప్పటికీ, ఊరికి దూరంగా ఉన్నప్పటికీ, అద్దె తక్కువ కాబట్టి అందులో ప్రవేశించేరు అవతారంగారు.

అవతారంగారి గురించి "మీ నాన్నగారికి ఎక్కడమ్మా పని" అని ఎవరైనా అడిగేరంటల "బ్యాంకీలో" అని టక్కున చెప్పగల కమల, "బ్యాంకులో ఏం పని? ఎన్నాళ్ళ సర్వీసు? జీతం ఎంత స్తాయి?" ఇటువంటి ప్రశ్నలు వేస్తేమాత్రం సరిగా సమాధానం చెప్పలేదు. అవతారంగారి అర్జన ఇంటికి ఎంతమట్టుకు ఆధారంగా ఉందో, ఆ అర్జన ఇంటికి చాల్తుందో చాలదో అనే విషయాల గురించి కమలెప్పుడూ ఆలోచించ నేలేదు. తన స్కూలేమిటో, తన చదువేమిటో, అంతే.

కిందటేడు ఏప్రెల్లో, కమల మూడోఫారం పరీక్ష రాసి పాసయిన రోజుల్లో ఆమెకి పన్నెండోయేడు దాటింది. ఆమె ఆ వెంటనే ఈ యింట్లోకివచ్చి పడింది. అంతటిలో.

"స్కూలు ఇక్కడికి చాలాదూరం, అవునా? మరి ఒక్కర్తివీ అంతదూరం నడిచి ఎలా వెళ్తావో నువ్వే చెప్పు. వెళ్ళలేవు కదా. ఒప్పుకుంటావా? ఒప్పుకోవూ...అలా అంటావు. అంతే...మరి థర్డుఫారం పాసయేవు. అలాగా ఇలాగా కాకుండా ఫస్టుగా పాసయేవు. ఏం? చాల్దూ?! అల్ల వాళ్ళ సీతాలక్ష్మిని చూడు, ఎమ్మే పాసయిందా!? పాసయింది. పాసవుతేమాత్రం పెళ్లి చేసుకోకతప్పిందా?...అందుచేతా...ఆడపిల్లకీ...పెళ్ళి—పెళ్ళి—అదీ ముఖ్యం. తెలిసిందా?" అంటూ కొన్ని కారణాలు చెప్పి కమలని స్కూల్కి పంపించడం మాన్పించివేసేడు కమల తండ్రి.

అవి అసలు కారణాలుకావనీ, వట్టి సాకులుమాత్రమేననీ అసలు కారణం వేరే ఉందనీ ఆరోజే తెలిసింది కమలకి. తండ్రిని ఆఫీసుకి వెళ్లనిచ్చి తల్లిదగ్గర మారాం చేసిచేసి ఏడవగా, విసిగిపోయి కేకలువేసింది శేషమ్మగారు.

"మీ అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళూ పదిమందికీ ఎఫ్ఫేలూ ఎమ్మేలూ చెప్పించడానికి మీ నాన్న లక్షాధికారనుకున్నావా, కోటీశ్వర్లనుకున్నావా? లేక, దులుపుతే రాల్డానికి పెరట్లో రూపాయల చెట్లున్నాయనుకున్నావా? దయచేసి, ఏడుపు కట్టిపెట్టు. తెలిసిందా! ఎండెక్కింది. ఆ పచ్చికర్రలు కాస్త ఎండలో పడేసి పెట్టు" అని కేకలేసిన కమలతల్లి విసవిస వెళ్లింది వంటదగ్గరకి.

అంచుమీదట కళ్ళు తుడిచేసుకొంది కమలబాల.

అప్పట్నించీ, ఎవరూ చూడకుండా కళ్లు తుడిచేసుకోవడం అలవాటు చేసుకొంది కమలబాల.

ఆరోజున, కోపంగా ఉండడంచేత అవతారంగారి భార్య తన సంతానంయొక్క సంఖ్య ఎక్కువ చేసుకుంటే గాని, నిజంగా లేరావిడకి పదిమంది పిల్లలు.

కమల పుట్టిన పదేళ్ళనాటికి అవతారంగారికి, కడసారిది విమల కలిగింది. ఈమధ్యకాలంలో ఉద్భవించినవాళ్లు వరసగా నలుగురు. మొదటివాడు, సీతారాముడు. రెండవ్వాడు రాధాకృష్ణుడు. మూడోవాడు పార్వతీప్రసాదుడు. నాలుగోవాడు గంగాధరుడు. నలుగురూ రావులే. నలుగుర్నీ ఇంట్లో పిల్చే పిలుపు!

"ఒరే సీతా, ఒరేయ్ రాధా! ఏఁవర్రా గంగా, పార్వతీ! ఎంతసేపయింది ఒడ్డించేసి. ఇంకా అక్కడే కూర్చున్నారూ? ఎక్కడి దాపరించేరో ఏఁవిటో ఆ మొక్కలు. చస్తున్నాం మీ అక్కకి మతిపోతే మీకూ మతులు పోతున్నాయర్రా?! రండి వేగిరంరండి" అదీ సాధారణంగా శేషమ్మగారు వేసే కేక.

కొత్త ఇంటికి రాగానే అవతారంగారి భార్య పెరట్లో ధనియాలు చల్లింది. కాకరపాదు పెట్టింది. దొండబద్ద నాటింది. తరువాత, తోటలో ఓ రోజున కమల అటూ ఇటూ తిరిగి చప్పున తల్లి దగ్గరకి పరుగెత్తుకొచ్చి,

"అమ్మా అమ్మా, అల్లక్కడ కొత్తిమిరి మొక్కలు ఎన్నున్నాయనుకున్నావ్! ఎన్నో ఉన్నాయే" అంది.

"ఎక్కడే?"

"అక్కడా, ఎరువుకుప్పదగ్గిర"

"ఎరువుకుప్పదగ్గిర, అవా?! అవి బంతిమొక్కలే బ్రహ్మాజ మానవా"

"బంతిమొక్కలా?!"

"అవునే."

"బంతిపువ్వులు పూస్తాయా?!"

"బంతిమొక్కలకి బంతి పువ్వులు పుయ్యకపోతే పొట్ల కాయలు కాస్తాయనుకున్నావుటే. బావుందమ్మా బావుంది. చదవ్వేస్తే ఉన్న మతి కూడా పోయిందిట" అంది శేషమ్మగారు.

ఆరోజునుంచే కమలకి మతిమారడం జరిగింది.

ఆరోజే ఆవెంటనే పువ్వులతోట వేసేదామనుకోలేదు కమల. కాని, మసిబొగ్గుల్లో మాణిక్యం కనిపిస్తే దాన్ని వేరె తీసేసి దానికి తగిన ఏర్పాట్లు దానికి చేసినట్టుగా, ఎరువుకుప్పనుంచి బంతి మొక్కల్ని వేరుచేయాలని కమలకి కలిగిన ఆలోచన "పూలతోట"కి దారితీసింది. తిరువాత ఆ ఎరువునే ఆ కమలే మోసుకొచ్చి ఆ మొక్కలకే వేయడం జరిగిందనుకోండి. కాని అది వేరే సంగతి. ముందు, ఆ మొక్కల్ని కొన్ని తీసుకొచ్చి పెరట్లో పాతింది కమల.

ఆ మొక్కల్ని అక్కణ్ణించి తీసుకురావడానిగ్గాని, వాటిని పెరట్లో పాతడానిగ్గాని ఇంత చిన్న పిసరైనా సాయం చెయ్యని పెద తమ్ముడు—సీతగాడు—"అక్కయ్యా, అవన్నీ పెరట్లో వేస్తున్నావా? ముందువేపు వేస్తే షోగ్గా ఉండదుటే: పువ్వులు పూసినప్పుడు అంతా సుమ్మెత్తిపోరూ?!" అని చెప్పి మొక్కల్ని ఇంటిముందు నాటమని సలహా ఇచ్చేడు. అది బావుందని ఆ సలహా పాటించింది కమల. "అక్కయ్యా, లైనుగా వేస్తే బావుంటుందికదే" అన్నాడు రాధ. అలాగే చేసింది కమల. "అక్కా అక్కా, అంత దగ్గిరగా పాత్తే, మన గదిలో పాముల్లాగ ఇరుగ్గా ఉంటుందే. కొంచెం దూరంగా పాద్దూ" అన్నాడు పార్వతి. "నువ్వేం సలహాలేం చెప్పక్కర్లేదు. చాతనైతే సాయం చెయ్యి. లేకపోతే నోరుమూసు క్కూచో" అనేసినప్పటికీ పార్వతిగాడి సలహాప్రకారం మొక్కల్ని దూర దూరంగానే నాటింది కమల. గంగగాడు సలహాలేమీ ఇవ్వకుండా, చిన్న చెంబులో నీళ్ళు పట్టుకొచ్చి ఇచ్చేడు. విమల సలహాలూ ఇవ్వలేదు, ఊరికే కూర్చోనూ లేదు; అటూఇటూ తిరిగి, మొక్కల్ని కొన్ని నాటబోయి, కొన్ని తొక్కేసి, అందరి కాళ్ళల్లోనూ అడ్డంగా పడి, కమలచేత చీవాట్లు తిని, సీతచేత ఓదార్చబడి, అమ్మ దగ్గరకి తీసుకుపోబడింది.

ఆఖరికి, ఆ సాయంకాలానికి, అంతా కలిసి ఆరు వరసల్లో ముప్పై బంతిమొక్కలు నాటేరు.

నాటిననాటి ఆ సాయంత్రం ముప్ఫయి మొక్కలూ కూడా సొమ్మసిలిపోయి తలలు వేళ్ళాడవేసేసేయి.

ఆ రాత్రి ఆకాశంలో చంద్రుడు లేడు. ఎక్కడా మేఘాలూ లేవు. చుక్కలున్నాయి కాని వాటివైపు చూడ్డంలేదు కమల. బుడ్డి దీపం చేతపట్టుకొని, మడిదగ్గర కూర్చొని, బుడ్డిదీపపు గుడ్డివెలుగులో చుక్కల్లాటి కళ్ళతో మొక్కల్ని బిక్కా బిక్కా చూసింది.

మొక్కలు బతకవేమోననే బెంగచేత ఆ రాత్రి అవతారాన్నీ శేషమ్మనీ బతకనిచ్చింది కాదు కమల.

"బతుకుతాయా, బతకవా?" అదే ప్రశ్న.

"బతుకుతే బతుకుతాయి. లేకపోతే పోతాయి. నువ్వు నన్ను మాత్రం చంపక కళ్లు మూసుకు పడుకో" అని అటు తిరిగి పడుకుంది శేషమ్మగారు.

ఆ రాత్రి తనకి ఎప్పుడు నిద్రపట్టిందో అన్న సంగతీ కమలకి తెలీదు. ఆ రాత్రి ఎక్కణ్ణించో వచ్చిన మేఘాలు ఎంతగానో వర్షించి వెళ్లిపోయాయన్న సంగతీ ఆ రాత్రి కమలకి తెలీదు.

మర్నాడు సూర్యుడు లేచిన కొంచెంసేపటికి నిద్రలేచిన కమల బాల, కళ్లు నులుముకొంటూనే ఇంటిముందుకివెళ్లి, చూసి, తెప్పున కేకవేసి మడిదగ్గరకి పరిగెట్టింది.

తల్లికి తెలుస్తుంది; తండ్రికీ తెలుస్తుంది; భగవంతుడికి తెలిసే ఉంటుంది; ప్రాణాన్నీ జీవితాన్నీ పెంచి పోషించేవారందరికీ తెలిసితీరాలి, ఆ ఉదయం తలఎత్తి నిల్చున్న చిన్నఎత్తు బంతి మొక్కలు ఓ పదమూడేళ్ళ ఆడపిల్లకి కలిగించిన సంతోష, సంభ్రమ, ఆశ్చర్య, ఆనంద, ఉద్వేగాలు ఎటువంటివో ఏమిటో.

ఇటు ఈ మొక్క దగ్గర నిల్చుంది కమల. అటు ఆ మొక్క దగ్గరకి పరిగెట్టింది కమల. ఇదే కమల ఈ మొక్కా అయింది. ఇదేకమల ఆ మొక్కా అయింది. నిన్నటి రాత్రి నీటిమబ్బూ ఈ కమలే. నిన్నరాత్రి వానజల్లూ ఈ కమలే. ఆ కమలే ఈ ఉదయం సూర్యరశ్మిగా మెరుస్తోంది. అదే కమల ఈ ఉదయం చల్లగాలిగా వీస్తోంది.

అది, అంతటిది, ఆ ఉత్సాహమే కమలని మరోకమలగా చేసింది.

మొక్కల్ని పెంచడమే ముఖ్యమైన పనయిపోయి కూర్చుంది కమలకి. కాని ఆ పెంచే అధికారం, అవకాశం కమలొక్కర్తె గుత్తకి పుచ్చుకోలేదు. అందులో మిగతావాళ్ళకూడా ఉన్నాయి షేర్సు. గంగగాడు చిన్న చెంబుతో పట్టుకెళ్లి ఆ మొక్కలకి అదే పనిగా నీళ్ళుపోస్తూండడమే వాడిపని. ఇంటివారి తోటమాలీ దగ్గరికి పోయి, బోరిగా తొల్లికా తెచ్చిఇచ్చి, ఇచ్చితెచ్చే పని పార్వతిగాడిది. ఎరువుమోసుకొచ్చి మొక్కలకి పొయ్యడం అనేది రాధగాడి పనుల్లో ఒకటి. రెండుపూట్లావచ్చి మొక్కల్ని తనిఖీచేసే అధికారి సీతగాడు. అప్పటప్పట, అవసరం వెంబడిని వచ్చి సైంటిస్టు సలహాలిచ్చే డ్యూటీ ఇంటివారి తోటమాలీది. తెలిసీ తెలియని సలహాలిచ్చే పని మొక్కల్ని పెంచడంలో పెద్దబాలశిక్ష చదువుతున్న అవతారం గారిది. అవతారంగారు సాయంకాలం ఆఫీసునుంచి వచ్చేక

మొక్కలదగ్గర వాలుకుర్చీ వేసుకొని న్యూస్ పేపరు చదువుకొనేప్పుడు పక్కన రాతిమీద కూర్చొని ఏదో కుడుతూ కుట్టకపోతూ కబుర్లుచెప్తూ, మధ్యమధ్య మొక్కల్నీ పిల్లల్నీ మెచ్చుకు గొప్పపడ్డం శేషమ్మగారి పని.

ఓ రోజు పొద్దున్నే.

“అక్కయ్యా! మొగ్గమొగ్గ!” అని కేకేసేడు పార్వతి.

ఆ దినం ఓ ఘడియసేపు వెర్రెత్తినట్టుగా తిరిగింది కమలబాల. ఆ రోజున గంగగాడు మొక్కలకి కుమ్మరించిన నీళ్లు ఇన్నీ అన్నీ కావు.

దాదాపు అన్ని మొక్కలూ మొగ్గతొడిగేయి.

అందుమీదట ఏ మొక్క ముందుపూస్తుందనే ప్రశ్న వచ్చింది. మొదటివరుసలోదా, మూడోవరుసలోదా, అదా ఇదా అని తర్జన భర్జన జరుగుతూండగానే అన్నిటిలోకీ పొట్టిమొక్కకి

ఒక పువ్వు కొంత విడింది.

బంగారమే అంతగా పండింది.

అప్పట్లో కమలకే కాదు, పిల్లలందరికీ వెర్రులెత్తేయి. అవతారంగారుకూడా సంతోషం ప్రకటించకుండా ఉండలేకపోయారు. శేషమ్మగారుకూడా కొంత చిన్నదయింది. విమల పెద్దగా కేకలేసి గంతులువేసింది. పువ్వు బాగా విడ్డాక “విమలా, పువ్వు ముట్టుకుంటే నాన్నతో చెప్పి తన్నిస్తా. ముట్టుకోకేం”అని కమల విమలని హెచ్చరించడంతో పువ్వులెవ్వరూ తెంపరాదనే రూలుకి పునాది ఏర్పడిందని చెప్పవచ్చు.

పూసిన ఒక్క పువ్వూ కోసేదమేనా? మరోటి కూడా బాగా విడ్డాక కొయ్యొచ్చు అని ఆదిలో అనుకున్నారు. తరువాత ప్రతి మొక్కకీ అధమం ఒక పువ్వయినా బాగా విడితేగాని ఏ పువ్వూ తెంపరాదనుకున్నారు. అయితే అన్నీ బాగా పూసేయి గాని మూడోవరుసలో మధ్యమొక్కమాత్రం మంకు పట్టు పట్టినట్టుగా ఎంతకీ మొగ్గయినా తొడిగిందికాదు. చివరకి దానంతట దానికే తిక్కతిరిగి మొగ్గతొడిగింది. నాలుగు పువ్వులు విడ్డాయి.

అప్పుడు విమలని పొట్టిమొక్కదో పువ్వు తెంపుకోనిచ్చింది కమల. తెంపుకోనివ్వడం ఏమిటి? తనే తెంపిఇచ్చింది. తెంపిందే కాని తెగవిచారించింది.

ఆవేళ రాత్రి గంగగాడు మొక్కల పక్కన గొంతు కూర్చున్నాడు. నడుంమీద చేతులు వేసుకొని పక్కనే కమల నిల్చొని మొక్కలవైపు చూస్తోంది. అప్పుడు గంగగాడు “అక్కయ్యా! మేక తినేస్తే మొక్క లెదుస్తాయని చెప్పేవు కదా ఆవేళా. మరి నాకే నువ్వెందుకే పువ్వు తెంపేసేవూ?” అని అక్కని అడిగేడు.

అక్క జవాబు చెప్పలేదు. పొట్టిమొక్కవైపు నిదానంగా చూస్తోంది.

పైన చంద్రుడు ఆకాశంలో విచ్చలవిడిగా తిరుగుతూన్నట్టుగా ఉన్నాడు. చంద్రకాంతులు బంతిపువ్వుల్లోకి ఇంకిపోతున్నాయి; బంతిపువ్వులమీంచి జారిపోతున్నాయి. ఇంట్లోంచి రాధగాడి నవ్వు వినిపిస్తోంది. పొట్టిమొక్కది పువ్వుపోయిన మొండి రెమ్మ మాత్రం చందమామవైపు దీనంగా చూసింది. ఆ కొమ్మవైపు జాలిగా చూసింది కమల.

“ఒరే గంగా, మరింకెప్పుడూ తెంపొద్దురా” అంది కమల ఉన్నట్టుండి పెద్ద నిశ్చయానికి పూర్తిగా వచ్చేసి.

అది కిందటేడు జరిగిన విషయం.

నెలలు నడిచేయి. సంవత్సరం మారింది. కిందటేడు తీసి దాచిన విత్తనాలు మొలకలెత్తేయి. ఈసారి స్వయం అవతారంగారే నడుంకట్టి రెండు ఇళ్ళకీ మధ్యగా పెద్ద మడి తయారుచేసేరు. అందులోకి బంతిమొక్కల్ని మార్చి నాటేరు. విధీ విరామం లేకుండా నీళ్లు పొయ్యడానికి గంగా పార్వతీ ఉండనేఉన్నారు. ఎరువు వెయ్యడంలో సీతగాడు కూడా చిన్నసాయం చేసేడు. మొక్కలు ఎదిగేయి. మొగ్గ తొడిగేయి. ముచ్చటగా పూసేయి.

“పువ్వు లెవ్వరూ తెంపరాదు.”

అది నిరుటి రూలే. కొత్తదేంకాదు. రూల్ని ఖచ్చితంగానే ఎన్ఫోర్సు చేస్తూ వచ్చింది కమల. పువ్వులు తెంపాలన్నా విమల తెంపాలి. కాకపోతే శేషమ్మగారు తెంపాలి. విమలని అదుపులో ఉంచడం అట్టే కష్టంకాదు. శేషమ్మగారి పూజకి తోట్లో ఎర్ర గన్నేరు పువ్వులు ఉండనే ఉన్నాయి.

మొక్కలకి సంరక్షణ పుష్టిగా ఉంది. మొక్కలన్నీ బాగా లేచేయి బలంగా లేచేయి. కొల్లగాపూసిన పువ్వుల్లో ఒక్క రేకైనా ఎవర్నీ తెంపనివ్వదు కమల. ఇంటిముందు ఆ రవ్వంత మేరా పచ్చగా ఉంది. నందనవనంలో ఓ చెక్కలా ఉంది. తను ఏర్పచుకున్న ఆ అందాన్ని చూస్తూ అక్కడ ఆ రాతిమీద కూర్చున్నప్పుడు ఎన్నో విషయాలు మరిచేది కమలబాల. ఆ విషయాలు మర్చిపోడానికే అక్కడ కూర్చొనేది కమలబాల. దూరంలో ఉన్న స్కూలూ; బడిమీద, ఎండలో మెరిసే కంచుగంటా; పదిగంటలకి కొన్ని వందల కంఠాలు పలికే ప్రార్థనపాటా; క్లాసురూంలో నల్లబోర్డుపైనుంచి, వెల్లవేసిన గోడమీంచి మోహనదాస్ కరమ్‌చంద్ గాంధీ అనే ముసలాయన చూసే చల్ల చూపూ; క్లాసులో అందర్నీ నవ్విద్దామని తాపత్రయపడే సరస్వతి ఎప్పుడూ నవ్వే కలకలనవ్వూ; తనకీ సావిత్రికీ తెలుగులో ఫస్టుమార్కుల పోటీ; ప్రస్తుతం ఇంట్లో కర్ర పెట్టెలో దాచే సబ్బు పెట్టెలో ఆరోజుల్లో కలకల్లాడుతూ కులికే సుద్దముక్కలూ, రంగు పెన్సిళ్లూ, రిబ్బను ముక్కలూ; మూడోఫారానికి ఇంగ్లీషూ, నాలుగోఫారానికి దేశచరిత్రా చెప్పే సరోజినమ్మగారు క్లాసులో అకుసు పెట్టిపెట్టడంలో వేసే కమ్మని అత్తరువాసనా; కబుర్లుచెప్పే సైన్సు టీచర్‌గారి సన్నటికంఠం; తెలుగుపద్యాలూ; ఇంగ్లీషు స్పెల్లింగ్సూ; లెక్కలస్టెప్పూ, అన్నిటినుంచీ మర్చిపోయేది కమలబాల. చిక్కని ఆకుపచ్చటి ఆకులూ, చక్కని బంగారురేకుల పువ్వులూ. వీటిచాటున ఎక్కడో ఉండిపోతాయి ఆ స్కూలూ, ఆ రోజులూ అన్నీ కూడా.

అలా ఓరోజున ఆ మొక్కలదగ్గర ఉదయం హాయిగా కూర్చున్నప్పుడే వచ్చేడు బక్కభగవాన్లు.

ప్రతినెలా జీతం అందిననాటిరాత్రి, పడుక్కునేముందు, తల కింద తలగడా సరిచేసుకొంటూ "తెల్లారేసరికల్లా తయారవుతాడ్రా బక్క ముండాకొడుకు" అని ఓసారి అనుకోకుండా పడుకోరు అవతారంగారు. సరిగ్గా అలాగే మర్నాడు పొద్దుటే ఏదో గంట కొట్టే సరికల్లా "అయ్యా అవతారంగారూ" అని కేకేస్తూ అర్జీ పనులు చెయ్యడానికి వస్తాడు బక్క భగవాన్లు, ఆ కంఠానికి పది జీరలు. పది అవతారాల్ని ఉద్దేశించి పిల్చేదా అనిపిస్తుంది.

ఇంటివారి ఇల్లు, ఇంటివారితోట, ఇంటివారి ఇక్కడి వ్యవహారాలన్నీ చూసేఉద్యోగం బక్క భగవాన్లుది. ఆరోజున అద్దె పుచ్చుకున్నాక "ఇంటివాళ్లు క్రిస్‌మస్‌కి వస్తున్నారండోయ్" అని చెప్పేసి నవ్వుకొంటూ చక్కాపోయేడు. ఇంటివాళ్ళు పక్కనే ఉన్నట్లయితే అద్దెకున్న వాళ్ళ సంకటాలు అణిగిపోతాయని భగవాన్లుగారి అభిప్రాయం.

వేసంగికే రావడం ఇంటివారి అలవాటు ఇప్పుడెందుకొస్తున్నారో అనుకున్నారంతా. భగవాన్లు కూడా ఏ మాటా తెలీదుట.

ఇంటివారంటే అంతఇష్టం లేదు కమలకి. ఇంటాయన ఎటువంటివాడో తెలీదు. అత నెప్పుడూ చిన్నింటివైపుకి రాడు. ఇంటావిడ మంచిమనిషిలాగే కనిపిస్తుంది. ఇంటివారి పెద్దకూతురు అత్తవారింట్లో పాట్నాలో ఉంటుంది. ఆమెని ఎరుగదు కమల. రెండో కూతురు పదహారేళ్ళ వయసుదే అయినప్పటికీ పాతికేళ్ళ మనిషిలా ఉంటుంది. తనకి పదేళ్లే ఉన్నట్టు ప్రవర్తిస్తుంది. ఆ అమ్మాయి కిందనుంటే పంటలుండవు. మీదనుంటే వర్షాలుండవు. మూడో అమ్మాయి నెమ్మదిగానే ఉంటుంది. పదేళ్లది ఆ పిల్లని "రెండు జడలమ్మాయి" అంటారు అవతారంగారింట్లో అంతా.

నిన్న మధ్యాహ్నం పన్నెండు గంటలకి కారు దిగేరు ఇంటివారు. అందరికంటే ముందు ఆఖరమ్మాయి కార్లోంచి బైటికి బంతిలా గెంతి ఇంట్లోకి వెళ్ళింది. ఆ పిల్ల వెనక ఇంటాయన దిగేరు. ఆయనది బట్టతల. మనిషి సన్నగా ఎర్రగా ఉన్నాడు. ఫ్లానల్‌సూట్లో ఉన్నాడు. ఆయన భార్య కార్లోంచి నెమ్మదిగా దిగింది. నిండుగా ఎత్తుగా ఉంది. బ్లడ్ రెడ్ సారీ కట్టుకొంది. ఛాయ మేలిమి బంగారంలా ఉంది. వారి రెండో అమ్మాయి కార్లోంచి దిగలేదు. ఆమెని నెమ్మదిగా దింపేరు. ఆమె కట్టుకున్న సారీమీద ఓవర్ కోటు తొడుక్కుంది. పెద్దగా మూలుగుతోంది.

"అమ్మాయిగారికేమొచ్చిందమ్మా" అని భగవాన్లు మిక్కిలి ఆందోళనతోనూ, అతి వినయంగానూ ప్రశ్నించేడు.

అమ్మాయిగారికి 'ఫీవర'ట.

అందుగురించి బక్క భగవాన్లు ఇసుమంతైనా చింతించనట్టే కమల కూడా ఇంత పిసరైనా విచారించలేదు.

కాని—

ఇంటివాళ్ళు ఎందు కొచ్చేరు? ఎన్నాళ్లుంటారు? వాళ్లక్కడ ఉన్నన్నాళ్ళూ ఆ అమ్మాయికి ఉష్ణం ఉంటుందా ఉండదా? అని రాత్రి ఆలోచిస్తూ పడుక్కుంది కమల.

ఉదయాన్నే లేచింది కమల.

ఉదయం నెమ్మదిగా వెళ్లింది. ఇంటివారి రెండో అమ్మాయిగురించి ఆస్పత్రి నర్సొకతె వచ్చింది. మధ్యాహ్నం ఇంటివారి నౌకరు శేషమ్మగార్ని బిందె ఒకటి అడిగి పట్టుకు వెళ్లేడు. అంతే. మరేం విశేషాల్లేవు.

మధ్యాహ్నం మూడు గంటలకి మాత్రం—

చిన్న బిందెలో నీళ్లు పట్టుకొని గుమ్మందగ్గరికి వచ్చిన కమల వచ్చీ రావడంతో, ఒక్క కేక వేసి, బిందెని అలానే విడిచేసి పరిగెట్టింది మొక్కలదగ్గరికి.

మేడ ఇంటి డ్రాయింగ్‌రూమ్‌వైపు వరాండాలోకి ఇంటావిడా, చిన్న ఇంటి గుమ్మంలోకి శేషమ్మగారూ ఒక్కసారే వచ్చేరు.

ఇంటివారి ఆఖరమ్మాయి—రెండు జడలు వేసుకున్నది, బ్లౌజు తొడుక్కున్నది, గాలికొట్టిన బంతిలా ఉన్నది—

"నే కోసుకుంటా. నా యిష్టం. నాక్కావాలి" అని గట్టిగా అరుస్తోంది. ఆమె చేతులు గట్టిగాపట్టుకొని, "వీల్లేదు. కోయొద్దు. మావి" అని కమల కేకలేస్తోంది. ఇద్దరూ పెనగులాడుతున్నారు. మూడు బంతిపువ్వులు నలిగి నేలనిపడ్డాయి.

"ఏం పిల్లా! ఏమిటా అల్లరి?" అని,

ఇంటావిడ పొప్పగానూ గట్టిగానూ కమల్ని మాత్రం ఉద్దేశించి అడిగింది. ఇద్దరమ్మాయిలూ పెనగులాట ఆపేసి, అలానే నిల్చుండిపోయేరు. అంతలోనే శేషమ్మగారొచ్చి కమల పట్టిన పట్టు విడిపించి, కూతురిచెయ్యి పట్టుకు నిల్చుంది.

"లుక్ హియర్ మమీ..." అని ప్రారంభించి చెప్పింది రెండుజడ లమ్మాయి.

"నెవర్ మైన్డ్ హర్. యూ టేక్ ఏజ్ మెని ఏజ్ యూ లైక్" అని ఆ అమ్మాయితో చెప్పి,

"ఆ పువ్వులే అంత మహా భాగ్యంటమ్మా?! మా అమ్మాయలా సిల్లీగా అల్లరి చేస్తోందేమిటి?! కోసుకుంటుంది నా బేబీ, దాన్నేం అనకండి."

అని శేషమ్మగారితో చెప్పి లోనికి వెళిపోయింది ఇంటావిడ. ఆవిడ కోపగించుకున్నట్టు తెలియడం లేదు. "ఇంత స్వల్ప విషయానికి ఎందుకంత అల్లరి? క్వైట్ అనెసెసరీ" అని ఆవిడ చిరాకు పడ్డట్టుమాత్రం స్పష్టంగా తెలుస్తోంది, ఏదో చెప్తామను కొంది శేషమ్మగారు. ఏం చెప్తామన్నా ఇంటావిడ లోనికి వెళ్లనే వెళిపోయింది.

తల్లి ముఖంలోకి చూసింది కమల. బేబీని వారించడానికి శేషమ్మగారికి ధైర్యంలేదని ఆమె ముఖం చెప్పక చెప్తోంది.

"ఈ తుపాకీ పేలదు."

అని చెప్పడానికి, అసలు, తుపాకీలాంటి మనిషి కానేకాదు శేషమ్మగారు.

ఈలోపున తెంపేసుకొంటోంది ఇంటివారి బేబీ, బంతి పువ్వుల్నీ, కావలసినవన్నీ.

నెమ్మదిగా, వెనక్కి తిరిగి చూడకుండా ఇంటివైపుకి నడిచేరు తల్లీకూతుళ్లు. గుమ్మంలో గంగ చెయ్యిపట్టుకు నిల్చున్న విమల రాగాలు పెట్టింది. గంగగాడు రాగాలుపెట్టలేక నిల్చున్నాడు.

బంతిపువ్వులే మహాభాగ్యమా ?!

కళ్లు తుడుచుకొంది కమలబాల.

మేడ ఇంటిమీద మేడ అంచు ఎగువకివచ్చిన చందమామ, చక్కనివి, చిన్నచిన్నవి నవ్వులు ఎన్నెన్నో పారేస్తూనే ఉన్నాడు. కాని,

కళ్ళుతుడుచుకొంది కమలబాల.

కళ్ళుతుడుచుకొంటూనే ఉంది కమలబాల.